నమస్తే తెలంగాణ

నిర్మల్

వాతావరణం
గరిష్ఠం 31.0°
కనిష్ఠం 7.4°

ఆదివారం 7, జనవరి 2018 ntnews.com ntnirmal.com పేజీలు : 16



వీసీలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారులు

- ఆ దిశగా అధికారులు కృషి చేయాలి
- ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ సుధాకర్
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

'పది'లో

ఉత్తమ ఫలితాలు సాధించాలి

16

నేడు 'నమస్తే తెలంగాణ' సంక్రాంతి ముగ్గుల పోటీ

- ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 9 గంటలకు ప్రారంభం
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వివరాలు 3 లో...



సిరుల పంట పండింది..!

- జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి
- 4,62,296 క్వింటాళ్ల కొనుగోళ్లు
- 16,663 రైతులకు రూ.73కోట్లు చెల్లింపు
- ప్రారంభమైన కస్టం మిల్లింగ్

3

జిల్లాలో రైతుల ఇంట సిరుల పంట పండింది.. వానాకాలం సీజన్‌లో ధాన్యం పంట పెద్ద ఎత్తున దిగుబడి వచ్చింది.. ప్రభుత్వం జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించింది. మొత్తం 100వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. 4,62,296 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి.. అన్నదాతకు మద్దతుగా నిలిచింది. గత అనుభవాల నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు, రైస్ మిల్లులకు తరలించింది. 'ఏ' గ్రేడ్ రకానికి రూ. 1590.. 'బీ' గ్రేడ్ రకానికి రూ. 1550 చొప్పున చెల్లించగా.. రైతులకు డబ్బులు చెల్లింపుల్లో జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

-నిర్మల్ ప్రధాన ప్రతినిధి/ నమస్తే తెలంగాణ

'మధ్యాహ్నం' వేడి వేడి బిర్యానీ !

- ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహారం
- ప్రతి శనివారం అమలు
- 'వారం మెనూ'లో మార్పులు చేసిన విద్యాశాఖ
- ఆనందంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఇక నుంచి వేడివేడి బిర్యానీ అందనుంది. పౌష్టికాహారం, రుచికరమైన భోజనం అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతి శనివారం విద్యార్థులకు బిర్యానీ అందించనున్నారు. కూరగాయలు, బఠానీలు, మిల్‌మేకర్లు తదితర వాటితో బిర్యానీ తయారుచేస్తారు. జిల్లాలోని 729 సర్కారు బడులు ఉండగా, 68 వేల మంది విద్యార్థులకు బిర్యానీ అందించనున్నారు.

-సారంగాపూర్

9



భైంసాలో బ్లడ్ బ్యాంకు

- రక్తనిధి ఏర్పాటుకు నిధులు
- ఆరు మాసాల్లో అందుబాటులోకి..
- ఆపదలో ఉన్న వారికి సత్వరం రక్తం

9



ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థి మృతి







బావిలో కనిపిస్తున్న విద్యార్థి నగేశ్ మృతదేహం

నగేశ్ (ఫైల్)

మృత దేహన్ని చూసేందుకు తరలివస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి :

మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన గుగ్గే నగేశ్(18) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిమృతి చెందినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముత్నూర్ గ్రామానికి చెందిన నగేశ్ మండలకేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుకుంటున్నాడు. అప్పుడప్పుడు వ్యవసాయ పనులు చేస్తుండేవాడు. రోజూ మాదిరిగా శనివారం ఉదయం పనులకు వెళ్లి వ్యవసాయ బావిలో స్నానం కోసం దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతిచెందినట్లు ఆయన వివరించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

విషాదంలో ముత్నూర్ ప్రజలు..

ముత్నూర్ గ్రామానికి చెందిన విద్యార్థి నగేశ్ ప్రమాదవశత్తు బావిలో పడి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. అందరితో కలిసి మెలిసి ఉండే నగేశ్ మృతిని చూసి కంట తడిపెట్టుకున్నారు. నగేశ్ మృతితో ముత్నూర్ గ్రామంలో విషాదం నెలకొంది.

గంగిరెద్దుల ప్రదర్శనకు ఆటంకం ఉండదు

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో గంగిరెద్దుల ప్రదర్శనకు ఎలాంటి ఆటంకం ఉండదని ఎస్పీ విష్ణువారియర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గంగిరెద్దుల ప్రదర్శనతో ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛందంగా ఇచ్చిన కానుకలను స్వీకరించడం సంస్కృతీ సంప్రదాయాల్లో ఓ భాగమని పేర్కొన్నారు. జిల్లా పోలీసుల తరపున ఎలాంటి ఆటంకం ఉండదని తెలిపారు. కేవలం రహదారులపైనే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వాటినే పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని పేర్కొన్నా రు. ఈ ప్రక్రియలో గంగిరెద్దులను ప్రదర్శించే వారిపై ఎలాంటి చర్యలు ఉండవని సోషల్ మీడియాలో వస్తున్న అపోహలను, వదంతులను నమ్మవద్దని సూచించారు. గంగిరెద్దులను ప్రదర్శించే వారికి ఆటంకం కలిగినా, ఏదైనా ఇబ్బంది ఎదురైనా పోలీసు వాట్సాప్ నం.83398 6898, డయల్ 100కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని సూచించారు.

పిచ్చి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



పరామర్శిస్తున్న టీఆర్ఎస్ మైనార్టీ సెల్ కార్యదర్శి

నిర్మల్ క్రైం : జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్ పోలీస్ గుట్ట వద్ద శనివారం ఇంటివద్ద ఆడుకుంటున్న ఐదేళ్ల వయస్సున్న మహ్మద్ రహమాన్‌పై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో కుడి ఎడమ చేతులకు తీవ్రగాయాలయ్యాయి. బాలుడు కేకలు వేయడంతో స్థానికులు పిచ్చి కుక్కను కర్రతో కొట్టారు .ఈవిషయాన్ని తెలుసుకున్న టీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యర్శి కలీం పరామర్శించి పిచ్చి కుక్కలను అరికట్టాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

బేల : మండలంలోని సాంగిడి పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 6ట్రాక్టర్లను ఎస్సై కోల నరేశ్ కుమార్ శనివారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈయనతో పాటు కానిస్టేబుళ్లు నర్సింగ్, తానాజీ, స్వామి తదితరులు ఉన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్సై మధుసుమన్

లోకేశ్వరం : వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై మధుసుమన్ అన్నారు. శనివారం మండలంలోని మన్మథ్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పలువురు వాహనదారులకు పలు సూచనలు అందజేశారు. వాహనదారులు హెల్మెట్‌తో పాటు వాహనానికి సంబంధించిన నిజ ధృవీకరణ పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అతివేగంతో ప్రాణాలు కోల్పోతున్న బాధితుల కుటుంబ పరిస్థితులను గమనించి వాహనాలను నడిపే సమయంలో జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.ఆటో డ్రైవర్లు మోతా దుకు మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దన్నారు. డ్రెస్‌కోడ్ తప్పనిసరి పేర్కొన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించి సహకరించాల న్నారు. వాహనాల తనిఖీలో పలువురికి జరిమానా విధించారు.

శబరిమలైకి తరలిన మాలధారులు



ఇరుముడులు కట్టుకుంటున్న అయ్యప్పమాలధారులు

తానూర్ : అయ్యప్ప మాలధారణ స్వీరించిన భక్తులు 41 రోజుల దీక్ష విరమణ కోసం శనివారం మండల కేంద్రం నుంచి శబరిమలైకి తరలివెళ్లారు. విఠలేశ్వర ఆలయంలో గురుస్వాములు గోపాల్, పుండ్లీక్, కృష్ణమాచారి ఇరుముడులు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో శబరిమలైకి వెళ్లారు. మాధవ్‌రావు పటేల్ తదితరులు ఉన్నారు.

శబరిమలకు పయనం

కుభీర్: మండలకేంద్రంలోని అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు శనివారం శబరిమలకు బయలుదేరారు. శ్రీవిఠలేశ్వరాలయంలో సామూహిక ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుస్వాములు పెంటాజీ, ప్యాట గంగాధర్, రాందాస్, ప్రభాకర్ ఇరుముడులను కట్టారు. అనంతరం శబరిమలకు తరలి వెళ్లారు. సర్పంచి గోరేకర్ బాబు, ఎంపీటీసీలు మ్యాకల నర్సప్ప, బొప్ప నాగలింగం, గులాబ్, పి.విజయ్‌కుమార్, ఊషన్న, చందుసేట్ ఉన్నారు.

నేడు ఎంఎల్‌సీ కాటేపెల్లి జనార్దన్‌రెడ్డి రాక

ఖానాపూర్: ఎంఎల్‌సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి ఆదివారం ఖానాపూర్‌కు వస్తున్నట్లు పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఖానాపూర్‌లోని జేకే గార్డెన్స్‌లో నేడు పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నర్సయ్య, అంబటి గంగన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సరోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డితో పాటు ఎంఎల్‌సీ కాటేపెల్లి జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌సీ బీ. మోహన్‌రెడ్డి హాజరు అవుతున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన బయోసైన్స్ ఉపాధ్యాయుడు ఏనుగు అశోక్‌రెడ్డి సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

అట్టహాసంగా సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి పోటీలు



పోటీల్లో తలపడుతున్న ఆదిలాబాద్-నల్గొండ జిల్లా జట్లు

సీసీసీ నస్పూర్ : సెపక్‌తక్రా సీనియర్స్ రాష్ట్ర స్థాయి పోటీలు మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నస్పూర్‌కాలనీ సింగరేణి మనోరంజని సముదాయ్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. పాత 10 జిల్లాల నుంచి దాదాపు 150మంది క్రీడాకారులు తరలివచ్చారు. ముందుగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, ఎమ్మెల్యే దివాకర్‌రావు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. సెపక్‌తక్రా తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీలో రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రిష్ణవేణి హైస్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ బేర సత్యనారాయణ, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, డీవైపీఎం తుకారాం, మార్కెట్ కమిటీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ వంగ తిరుపతి, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఈశ్వరాచారి, అశోక్, పానుగంటి సత్తయ్య, బండి రమేశ్, అన్నయ్య, హైమద్, గోపాల్‌రెడ్డి, మోతె రాఘవరెడ్డి, లెక్కల విజయ్, సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆవును కాపాడిన పశువైద్య సిబ్బంది



ఆవుకు చికిత్సలు అందిస్తున్న డాక్టర్ అవినాష్

బోథ్, నమస్తే తెలంగాణ: మండలంలోని కౌఠ (బీ) గ్రామానికి చెందిన నోముల బాపురెడ్డి అనే రైతుకు చెందిన ఆవును శనివారం సంచార పశువైద్యశాల (1962) సిబ్బంది కాపాడారు. గర్భంతో ఉన్న ఆవు యజమాని 1962కు సమాచారం అందించారు. వెంటనే సంచార పశువైద్యశాల బృందం అక్కడికి చేరుకున్నారు. పశు వైద్యాధికారి అవినాష్ ఆవుకు చికిత్సలు అందించి ప్రసవాన్ని సులువు చేశారు. ఆవు దూడకు జన్మనివ్వడంతో వైద్య సిబ్బందికి రైతు ధన్యవాదాలు తెలిపాడు. వెంట సిబ్బంది భూమన్న తదితరులు ఉన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంచార పశువైద్యశాలతో తన ఆవు బతికిందని రైతు పేర్కొన్నాడు.

నేడు ఓడీఎఫ్‌పై సమావేశం

జైనథ్ : ఈనెల 7న జైనథ్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు (ఓడీఎఫ్) బహిరంగ మల మూత్ర విసర్జన రహిత, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల ఎంపీడీవో రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పంచాయతీ కార్యదర్శులతో పాటు ఉపాధిహామీ సిబ్బంది సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన తెలిపారు.

నేడు బేలకు మంత్రి రాక

బేల : మండలంలోని కొగ్దూర్ గ్రామానికి ఆదివారం రాష్ట్ర మంత్రి జోగురామన్న వస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొగ్దూర్ గ్రామంలో మంత్రి జోగురామన్నకు పెద్ద ఎత్తున స న్మానం ఏర్పాటుచేశామని ఆయన వివరిం చారు

దౌనెల్లి గ్రామంలో శివ దీక్షలు ప్రారంభం

కుంటాల : మండలంలోని దౌనెల్లి గ్రామంలో శనివారం పలువురు యువకులు శివ దీక్ష స్వీకరించారు. 41 రోజుల పాటు నియమ నిష్ఠలతో దీక్షను చేపట్టనున్నారు. గ్రామంలోని శివాలయంలో భక్తులు దీక్ష తీసుకున్నారు. దీక్ష చేపట్టిన వారిలో చిన్న గజ్జరాం, రవి, అడెల్లు, మాధన్న, భూమేశ్, లింగన్న, లక్ష్మణ్ దీక్ష చేపట్టారు.

సిరుల పంట పండింది..!



దిలావర్‌పూర్ మండలం గుండంపల్లిలో ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

నిర్మల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వానాకాలం సీజన్‌లో 14,382హెక్టార్లలో వరి పంటను సాగు చేశారు. సుమారు 6లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం అధికారులు 115కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించగా.. చివరికి 100కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐకేపీ సిబ్బంది సమ్మెతో ఈ కేంద్రాలు పూర్తిగా తగ్గిపోయాయి. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 67 కేంద్రాలు, డీసీఎంఎస్ 30 కేంద్రాలు, డీఆర్‌డీఏ – ఐకేపీ ఆధ్వర్యంలో 3 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2017–18 వానాకాలం సీజన్‌లో 'ఎ' గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.1590 చొప్పున, 'బి' గ్రేడ్ (సాధారణం) రకానికి క్వింటాకు రూ.1550చొప్పున చెల్లించారు. ధాన్యంలో తేమ శాతం పరిశీలన కోసం 74 మాయిశ్చర్ మీటర్లు, ధాన్యంలో చెత్త చెదారం ఏరేసేందుకుగాను 65ప్యాడీ క్లీనర్లు, అకాల వర్షాలు సంభవిస్తే కప్పేందుకుగాను 2223 టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,62,296 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు మార్కెట్, కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారు. రైతులు తమ భోజన అవసరాల కోసం తాము పండించిన కొంత ధాన్యాన్ని తమ వద్ద నిల్వ ఉంచుకున్నారు.

రూ.73 కోట్ల చెల్లింపు

జిల్లాలో ఐకేపీ కేంద్రాల ద్వారా 6565క్వింటాళ్లు, డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా 1,67,117క్వింటాళ్లు, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 2,88,614క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో కొనుగోళ్లు చేసిన ధాన్యానికి సంబంధించి.. రూ.73కోట్ల మేర చెల్లించాల్సి వచ్చింది. ఇందులో రూ.30లక్షలు మినహా.. మిగతా డబ్బులు పూర్తిగా రైతులకు చెల్లించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను సంబంధిత కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేశారు. మూడు రోజుల్లోపై రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేశారు. రైతుల ఖాతాల నెంబర్లు సరిగా లేకపోవటం, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాల జిరాక్స్‌లు ఇవ్వడంలో జాప్యం కావటంతో ఈ రూ.30లక్షల చెల్లింపుల్లో జాప్యమవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం 16,663మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయగా.. రైతులకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వం బాసటగా నిలిచింది. ఇక ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల్లో రైస్‌మిల్లులు, గోదాంలకు తరలించారు.

జేసీ ప్రత్యేక దృష్టి

గత అనుభవాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. జేసీ శివలింగయ్య ప్రత్యేకంగా ఒక వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసి.. ఇతర అధికారులను సభ్యులుగా ఉంచారు. సభ్యులంతా ఆయా కేంద్రాలను పరిశీలించి.. కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే గ్రూపులో పెట్టారు. ఈ ఇబ్బందులు, సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని.. బృంద సభ్యులంతా కలిసి సమన్వయంతో పరిష్కరించారు. దీంతో కొనుగోళ్లు, రవాణా, చెల్లింపుల్లో ఇబ్బందులు, సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు వీలు కలిగింది. గత యాసంగి సీజన్ కొనుగోళ్లకు సంబంధించి రవాణా సమస్య ఏర్పడగా.. వర్షాలు కురిసి ధాన్యం పూర్తిగా తడిచిపోయింది. రైతులు, ఐకేపీ కేంద్రాల వారికి తడిచిన ధాన్యం విషయంలో కోత పెట్టారు. దీంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. ఈ సారి అలాంటి పరిస్థితి లేకుండా ముందే జాగ్రత్తలు తీసుకున్నారు. ఇప్పటికే మిల్లర్లు బియ్యం కస్టం మిల్లింగ్ ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటి వరకు 6వేల మెట్రిక్ టన్నుల బియ్యం కస్టం మిల్లింగ్ చేసి ఇవ్వగా.. మరో 15వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది.

నేడు 'నమస్తే' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

నిర్మల్, నమస్తే తెలంగాణ: ' నమస్తే తెలంగాణ' దినపత్రిక ఆధ్వర్యంలో ప్రతియేటా నిర్వహిస్తూ వస్తున్న సంక్రాంతి ముగ్గుల పోటీలను ఈ ఏడాది కూడా అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం మైదానంలో నిర్వహించనున్న ముగ్గుల పోటీలకు పట్టణంతో పాటు ముథోల్, ఖానాపూర్, నిర్మల్ నియోజకవర్గాల నుంచి మహిళలు తమ పేర్లను భారీగా నమోదు చేసుకున్నారు. ప్రముఖ కాంట్రాక్టర్, సామాజిక వేత్త, నిర్మల్ సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కాడి జగన్మోహన్‌రెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. పోటీల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోటీల్లో ముగ్గురు ఆడపడచులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు కూడా ఇవ్వనున్నారు.

సప్తమి వేడుకలు ప్రారంభం



వేడుకలు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్ : మండలంలోని మాంజ్రీ గ్రామంలో శనివారం సప్తమి వేడుకలు ప్రారంభమయ్యాయి. స్థానిక హనుమాన్ ఆలయ సమీపంలో శ్రీ విఠలేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలు ప్రారంభించారు. ఉదయం, రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ వేడుకలు ఏడు రోజులు కొనసాగుతాయన్నారు. చివరి రోజున అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రాందాస్, నాయకులు ఆనంద్‌రావు పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

కుభీర్: ప్రజలు పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పల్సి పంచాయతీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పంచాయతీ నిధులు– చేపట్టిన పనులపై రికార్డులను తనిఖీ చేశారు. ఇటీవల కొందరు కలెక్టర్‌కు నిధులు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదు చేయగా ఆయన తనిఖీ చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు నిధులను సద్వినియోగం చేసుకునేందుకు గ్రామసభలే ముఖ్యమన్నారు. పనులు చేసే వివరాలు తీర్మానాలు చేయించి ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటిపన్నును చెల్లించి సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం చేసుకుని ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పొందాలని అన్నారు. స్థానిక సర్పంచి ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, కుభీర్ ఈవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌సింగ్, ఎంపీటీసీ తోకల రాములు, మాజీ ఎంపీటీసీ తోట రాములు, రాజు, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.



కుభీర్: రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

వానల్‌పాడ్‌లో..

భైంసా రూరల్ : మండలంలోని వానల్‌పాడ్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఉప సర్పంచి రామ్‌కుమార్, నాయకులు ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో రోగులకు యువకుల రక్తదానం

నిర్మల్ క్రైం : ఖానాపూర్ మండలానికి చెందిన ఆకుల లక్షింబ అనారోగ్యంతో పట్టణంలోని ప్రసూతి దవాఖానలో చికిత్స పొందుతుండగా, మెరుగైన వైద్యం కోసం ఆమెకు ఏబీ పాజిటివ్ రక్తం అవసరం అని వైద్యులు తెలిపారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్తం అందుబాటులో లేకపోవడంతో రక్తదానానికి కృషి చేస్తున్న నరహరికి రోగి కుటుంబీకులు సమాచారం అందించారు.దీంతో ఆయన లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లికి చెందిన తన బంధువు సిరిపురం అఖిలేశ్‌కు తెలుపడంతో శనివారం ఆయన సకాలంలో రక్తం అందజేసి రోగి ప్రాణాలను కాపాడారు. ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న ఆదిలాబాద్ జిల్లా నేరేడిగొండ మండలం దేవారావు గ్రామానికి చెందినవో ఓ రోగికి బీ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ఖానాపూర్ పట్టణానికి చెందిన నరహరి మిత్రుడు నవీన్ రక్తదానం చేసి రోగి ప్రాణాలను కాపాడారు.స్వప్న మల్టీ స్పెషాలిటీ దవాఖానలో వెల్మల్ బొలప్పారంనకు చెందిన ఓ రోగికి ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో బెస్తవార్‌పేట్‌కు చెందిన సంతోష్ రక్తదానం చేశారు. రక్తదాతలను కుటుంబీకులు,వైద్యులు అభినందించారు.



రక్తదానం చేస్తున్న యువకులు

గోమాతకు అంత్యక్రియలు



మృతి చెందిన ఆవు



అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

సారంగాపూర్: తమ గ్రామపాలిట కల్పతరువుగా నిలిచి అనారోగ్యంతో శనివారం మృతి చెందిన గోమాతకు వీడీసీ సభ్యులు, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతి చెందిన గోమాత 18 ఏళ్ల క్రితం సుమారు 30 ఆవుదూడలకు జన్మనిచ్చి సంతాన లక్ష్మిగా వెలుగొందింది. మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన పాతర్ల పోతారెడ్డికి చెందిన ఆవుదూడ ఆరు నెలల వయస్సులో 18ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలువిరిగింది. దీంతో ఆ రైతు ఆ ఆవుదూడను దేవుడి పేరుమీద వదిలేశాడు. సదరు ఆవుదూడ స్థానిక సాయిబాబా ఆలయం వద్ద నివాసం ఉంటూ పెరిగింది. గోమాత శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు సాయిబాబా ఆలయం నుంచి మహిళలు మంగళ హారతులతో, డప్పు మేళాలతో భక్తిగీతాలు పాడుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఆలయంలోని పరిసర ప్రాంతంలో పెరిగిన చోటే అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. అంత్యక్రియల్లో అడెల్లి పోచమ్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీడీవో గుమ్ముల గంగాధర్, ఈవోపీఆర్డీ శేఖర్, ఏపీవో తులరామకృష్ణ, సర్పంచి తీగల మోహన్, మండల రైతుసమన్వయ కమిటీ అధ్యక్షుడు మదుకర్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు అట్ల పోతారెడ్డి, కోశాధికారి మెరుగు వెంకట్‌రెడ్డి, మ్యాక్స్ అధ్యక్షుడు రాంరెడ్డి గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

నాలుగో విడతలో 21 చెరువుల అభివృద్ధి

- సబ్ డివిజన్ ఏఈ శ్రీనివాస్‌రావు
- మిషన్ కాకతీయలో 110 చెరువులు




నాలుగో విడుతతో పునరుద్ధరించే చెరువులు



మాట్లాడుతున్న మిషన్ కాకతీయ ఏఈ శ్రీనివాస్

ఖానాపూర్: ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో మిషన్ కాకతీయ పథకంలో నాలుగు విడతల్లో మొత్తం 110 చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు సబ్ డివిజన్ ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. నాలుగో విడతలో మొత్తం నాలుగు మండలాల్లో కలిపి 21 చెరువులను కొత్తగా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. ఈ పనులు చేపట్టడం కోసం టెండర్లు పిలిచామని తెలిపారు. నాలుగో విడతలో చేపట్టబోయే 21 చెరువులకు రూ. 5 కోట్ల పైచిలుకు అంచనాలు రూపొందించామన్నారు. 21 చెరువుల్లో 7 చెరువులకు నిధుల మంజూరు కాలేదన్నారు. జనవరి నెలాఖరులోగా వాటికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయని తెలిపారు. మంజూరయిన చెరువుల్లో కడెం మండలం అల్లంపల్లి పుష్కలోడి చెరువు, నచ్చనయెల్లపూర్ మేడికుంట, ఎల్లగడప కుమ్మరి కుంట, చిట్యాల్ గ్రకుంట, లింగాపూర్ ఎంగిలాపురం కుంట, అంబారిపేట చెక్‌డ్యాం, కల్లెడ దోస్తునగర్ చెరువు, గంగాపూర్ మర్రిపేట చెరువు, ధర్మాజీపేట అప్పాయి కుంట, దస్తురాబాద్ మండలంలో ఆకొండపేట జన్నారపు బానయ్యకుంట, దస్తురాబాద్ తేలుకుంట, రేవోజీపేట బీది లిప్పకుంట, ఖానాపూర్ మండలంలో ఎక్బాల్‌పూర్ గొల్ల కుంట, రాజూరా చింతల చెరువు, తర్లాపాడు పులిచెరువు కుంట, బీర్నంది గొండోనికుంట, బీర్నందిలో గొల్లకుంట, పెంబి మండలంలో నాగాపూర్ రాగిచెరువు, మందపల్లి ఖానాపూర్ రాస్తాకుంట, మందపల్లిలో మరో చెరువు రాజూరా రాస్తా కుంట, ఇటిక్యాల గ్రామంలో భీమన్నకుంట చెరువును మిషన్ కాకతీయ పథకంలో పునరుద్ధరిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఈ చెరువుల కింద ఖానాపూర్, పెంబి మండలాల్లో 3450 ఎకరాలు ఉండగా చెరువలను పునరుద్ధరిస్తే మరో 15 వందల ఎకరాల ఆయకట్టు పెరుగుతుందన్నారు. కడెం, దస్తురాబాద్ మండలాల చెరువుల కింద 5 వేల 9 వందల ఎకరాల ఆయకట్టు ఉండగా పునరుద్ధరణ పనులు పూర్తి అయితే మరో 2 వేల ఎకరాల ఆయకట్టు పెరుగుతుందన్నారు. భూగర్భ జలాలు కూడా పుష్కలంగా పెరుగుతాయని పేర్కొన్నారు.

రికార్డు స్థాయిలో కందులు కొనుగోలు చేస్తాం: ఏఎంసీ చైర్మన్



మాట్లాడుతున్న ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ సక్కారాం శ్రీనివాస్

ఖానాపూర్: గత సంవత్సరం ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రికార్డు స్థాయిలో 10 వేల క్వింటాళ్ల కందులు కొనుగోలు చేశామని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సక్కారాం శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్‌లో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అధికారులు మొదట సహకరించలేదన్నారు. ఎమ్మెల్యే రేఖానాయక్ ఈ విషయంలో చొరువ తీసుకొని అధికారులను ఒప్పించి కొనుగోలు కేంద్రం ప్రారంభించారన్నారు. కనీసం 5 వేల క్వింటాళ్లు కొంటేనే సెంటర్ ఇస్తామని అధికారులు నిబంధన విధించగా ఇందుకు సమ్మతించామన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి, భైంసా, నిర్మల్ డివిజన్‌ల నుంచి రైతులను ఇక్కడికి రప్పించి 1100 మంది దగ్గర 10 వేల క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసి రికార్డు సృష్టించామన్నారు. ఇందులో ఎమ్మెల్యే రేఖానాయక్ కృషి ఎంతో ఉందన్నారు. ఈ సారి కూడా పాత రికార్డులను అధిగమించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రైతులు పంటను బాగా ఎండపెట్టి, 14 శాతం మాత్రమే తేమ ఉండే విధంగా మార్కెట్‌కు కందులను తీసుకొని రావాలని సూచించారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే అధికారులు కొనేందుకు అంగీకరించరన్నారు. గత సంవత్సరం క్వింటాలు కందులకు ప్రభుత్వం రూ. 5050 ధర చెల్లింగా ఈ సారి ఆ ధర క్వింటాలుకు రూ. 5450 కి పెరిగిందన్నారు. రైతులు తొందరపడి కందులను ఎట్టి పరిస్థితుల్లోను దళారులకు అమ్మి నష్టపోవద్దన్నారు. మార్కెట్ శాఖ అధికారులు రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తారని చెప్పారు. కందులు అమ్మిన రైతులకు వారం రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమ చేస్తామన్నారు. ఖానాపూర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ సారి కందులను కొంటున్నామన్నారు. పంటను అమ్మడానికి యార్డుకు వచ్చే రైతులు విధిగా వారి బ్యాంకు ఖాతా పుస్తకం, పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు, వీఆర్వో ధ్రువపత్రం జిరాక్స్‌ను వెంట తీసుకొని రావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి నేరెళ్ల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఐల్నేని అశోక్‌రావు, జన్నారపు శంకర్, టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగ్గిళ్ల రాజేందర్‌గౌడ్, నాయకులు కావలి సంతోష్, రహీం, నడిమెట్ల రమేశ్, ఫయీమ్, షేక్ షకీల్, పీఏసీఎస్ సీఈవో భూమి ఆశన్న, మార్కెట్ యార్డు కార్యదర్శి ఇర్ఫాన్ పాల్గొన్నారు.

పదో తరగతి టాపర్లకు నగదు పురస్కారాలు



టాపర్ల తండ్రులకు నగదు అందజేస్తున్న గోపల్‌రాజ్, హరి ప్రసాద్

ఖానాపూర్: ఖానాపూర్‌కు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజినీరు సాడిగె గోపాల్‌రాజ్ నీలిమ దంపతులు మండలంలోని 10వ తరగతి టాపర్లకు శనివారం నగదు పురస్కారాలను అందజేశారు. గోపాల్ రాజ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగాఅమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. 8 సంవత్సరాలుగా ఆయన ఖానాపూర్ మండలంలో 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 2500 చొప్పున నగదు బహుమతులను ఇస్తున్నారు. కష్టపడే విద్యార్థులకు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సాడిగె గోపాల్‌రాజ్ అన్నారు. పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన కామోజీ సృజన్‌కుమార్ తండ్రి కామోజీ శ్రీనివాస్‌కు, రుబీనా తబస్సుమ్ తండ్రి తురాబొద్దీన్‌కు రూ. 2500 చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో గోపాల్‌రాజ్ సోదరుడు సాడిగె హరి ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కడెం జడ్పీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

కడెం : కడెం జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఒడ్నాల వేణుగోపాల్, ఆకుల రాజేశ్వర్‌ను శనివారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమానికి పాఠశాల నుంచి తెలుగు ఉపాధ్యాయుడు ఒడ్నాల వేణుగోపాల్ హాజరై, పద్య కవితాగానంలో ప్రతిభ కనబర్చినందుకు, ఆకుల రాజేశ్వర్ ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు ఉత్తమ శిక్షణను అందిస్తున్నందుకు పూలమాల వేసి, శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయస్వప్న, ఉపాధ్యాయులు జొన్నల రవీందర్, నల్ల రాంరెడ్డి, జొన్నల రాజేందర్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ మండల కార్యవర్గం ఎన్నిక

పెంబి: ప్రగతిశీల యువజన సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పీవైఎల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల చంటి, అధ్యక్షుడు ముస్కే శంకర్ ఒక శనివారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మండల ప్రథమ మహాసభ అనంతరం ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రామయ్య ఆధ్వర్యంలో కమిటీని ప్రటించారు. అధ్యక్షుడిగా జంగు, ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రధానకార్యదర్శిగా మహేందర్, సహాయకార్యదర్శిగా మాణిక్‌రావ్, కోశాధికారిగా ఆర్క రవీందర్, సభ్యులుగా జైవంత్‌రావ్, సుదర్శన్ ఎన్నికయ్యారు.

నేడు యాదవ సంఘ సమావేశం

కడెం: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో ఆదివారం యాదవ సంఘ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు జక్కుల సత్తన్న యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కుల సంఘ సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో నిర్వహించే ఈ సమావేశానికి యాదవులతో పాటు బీసీ వర్గానికి చెందిన అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని బీసీలు ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దివ్యాంగులకు బస్సు పాసుల పంపిణీ



బస్సు పాసులు పంపిణీ చేస్తున్న నాయకులు

కడెం: మండలంలోని ఎల్లగడప గ్రామంలో శనివారం దివ్యాంగులకు ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న ఆర్టీసీ బస్సు పాసులను స్థానిక నాయకులు పంపిణీ చేశారు. 50 శాతం రాయితీతో అందజేసిన పాసులను పలువురు వికలాంగులకు అందజేసినట్లు సర్పంచి మౌనిక తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి స్టీఫెన్, టీఆర్‌ఎస్ నాయకులు కట్కనపల్లి భూమేశ్, డాక్టర్ శ్రీనివాస్, ఎం. సత్యనారాయణరావు, మాజీ సర్పంచి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు తరలిన జిల్లా నేతలు

సోన్: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు బీజేపీ జిల్లా నేతలు శనివారం హాజరయ్యారు. ఈ సమావేశాల్లో నిర్మల్ జిల్లా నివేదికను సమర్పించామన్నారు. ఈ వేదికపై కృష్ణ, గోదావరి నది జలాల రాష్ట్ర కన్వీనర్ రావుల రాంనాథ్ ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు మన్నె నారాయణ, సింగారి లక్ష్మణ్ పాల్గొన్నట్లు వివరించారు.

జామా మసీద్ కమిటీ ఎన్నిక

మామడ : జామా మసీద్ మామడ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ సదర్‌గా సయ్యద్ షాహిద్ ఎన్నికయ్యారు. మామడ గ్రామానికి చెందిన మైనార్టీలు ఎన్నికకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సదర్‌గా ఎన్నికైన షాహిద్‌కు పలువురు అభినందనలు తెలిపి సన్మానించారు.

'మనోభావాలను దెబ్బ తీసే కుట్ర'

నిర్మల్ టౌన్: ముస్లిముల మనోభావాలను దెబ్బ తీసే విధంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ముస్లిం బోర్డు లా సభ్యులు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లా బోర్డు నాయకుడు ముఫ్తి రియాజ్ అన్సారీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో త్రిబుల్ తలాక్‌పై చట్టం తీసుకురావడాన్ని లా బోర్డు వ్యతిరేకిస్తుందన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ముస్లిములు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మౌలానా, అలీం, ఖాస్మీన్, రఫీ హైమద్‌ఖురేషి, ముజాయిద్ అలీ, షకీర్, మహ్మద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

నర్సాపూర్ (జి): ఉపాధి హామీ 10వ విడతలో భాగంగా కొనసాగిన పనులపై శనివారం మండలంలోని కుస్లి గ్రామంలో డీఆర్‌పీ భూమన్న ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామంలోని వ్యవసాయ భూముల్లో చేపట్టిన ఉపాధి పనులపై ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరించారు. ఈ సమాచారాన్ని సోమవారం జరిగే గ్రామసభలో వెల్లడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఎస్‌ఏలు శ్రీనివాస్, అశ్విని, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ముథోల్

ntnews.com ntnirmal.com

పార్డి(బీ)లో ఉచిత నవోదయ కోచింగ్

కుభీర్: మండలంలోని పార్డి(బీ) గ్రామంలోని లింగిశెట్టి భోజన్న మెమోరియల్ ఆధ్వర్యంలో ఈనెల8వ తేదీ నుంచి కుభీర్, పార్డి(బీ) గ్రామాల్లో నవోదయ, గురుకుల ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు ఎల్బీఎం వ్యవస్థాపకుడు లింగిశెట్టి లింగేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 4,5 తరగతుల తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9440804779, 9492131760 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

12న నమూనా నవోదయ పరీక్ష

భైంసా, నమస్తే తెలంగాణ : పట్టణంలోని వేద తపోవన్ పాఠశాలలో ఈ నెల 12న నమూనా నవోదయ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల సంచాలకుడు శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కాగజ్‌నగర్ ప్రభుత్వ నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల కోసం నమూనా నవోదయ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షతో విద్యార్థులకు నవోదయ పరీక్ష విధి విధానం, పద్ధతిపై అవగాహన కలుగుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9989982629, 9010782794 నంబర్‌లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భైంసా, నమస్తే తెలంగాణ : మైనార్టీ వెల్ఫేర్, ఉర్దూ అకాడమిక్ ఆధ్వర్యంలో భైంసాలో టెట్ అభ్యర్థులకు ఏర్పాటు చేయనున్న డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను మైనార్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని టీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫారూక్ హైమద్ అన్నారు. పట్టణంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుడారు. డివిజన్‌లో ఉన్న డీఎస్సీ అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 20వ తేది వరకు పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 22వ తేదీ నుంచి ఫిబ్రవరి 17వ తేద వరకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8106545605 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు. సమావేశంలో నాయకులు రియాజ్‌ఖాన్, రషీద్, సాజీద్, సయ్యద్ అజూమ్, రాము, కృష్ణ తదితరులున్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

బాసర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్టీయూ క్యాలెండర్, డైరీలను ఎంఈవో మైసాజీ ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం పోరాడుతుందని మండల అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రఘు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

ముథోల్: మహారాష్ట్రలోని పుణే భీమకోరేగావ్ గ్రామంలో దళితులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని శనివారం తహసీల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జహీరుద్దీన్‌కు దళితుల సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రమేశ్ వాగ్మారే, నాయకులు కిషన్‌రావు, బీఎస్పీ జిల్లా ప్రధానకార్యదర్శి ప్రకాశ్, చెరుకుల రాజ్యం, దళిత సంఘాల నాయకులు దిగంబర్ సోన్ కాంబ్లే, విశ్వంబర్, అశోక్, మనోరంజన్, రాందాస్ దౌనే, దమ్మజోందిలే, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- కుంటాల, బాసరలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ
- అభివృద్ధి పనుల ప్రారంభం



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కుంటాల : సీఎం కేసీఆర్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఆదర్శంగా నిలుస్తున్నాయని ముథోల్ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి అన్నారు. కుంటాలలో శనివారం 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మండలంలో ప్రాణహిత చెవెళ్ల ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన రైతాంగానికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాకు రూ. 90కోట్ల నిధులు రానున్నాయని తెలిపారు. డబుల్ కల్లూర్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఓలా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రూర్బన్ పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. నియోజకవర్గంలో రూ.12కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

మసీదుల అభివృద్ధికి నిధులు...

మండలంలోని కల్లూర్, ఓలా గ్రామాల్లోని ముస్లిముల ప్రార్థన మందిరాల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దర్గా కమిటీ సభ్యులకు అందజేశారు. కల్లూర్‌కు రూ.17వేలు, ఓలా మసీదుకు రూ. 17వేల చెక్కులను అందజేశారు. కుంటాలలో రూ. 3లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్తపల్లి గంగామణి, జడ్పీటీసీ రాథోడ్ విమల, స్థానిక సర్పంచి అప్క గజ్జరాం యాదవ్, కోఆప్షన్ మెంబర్ హైమద్‌పాషా, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఎస్సై యూనీస్, టీఆర్ఎస్ మండల పార్టీ కన్వీనర్ జుట్టు మహేందర్, సర్పంచులు ఎగ్గాం గజ్జరాం, చిన్న రాజలింగు, కొత్తపల్లి బుచ్చన్న, సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, ప్రకాశ్ గౌడ్, ఖలీం, టీఆర్ఎస్ నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు....

బాసర : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పరంగా వచ్చే సంక్షేమ పథకాలను అందించేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర సర్కారు ఆడ పిల్లలు ఉన్న కుటుంబాలకు భారం కావద్దనే రూ. 75వేలు ఆర్థిక సహాయంగా అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కల్యాణలక్ష్మి 13, షాదీముబారక్ 3 చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాసర ఆలయ పాలకవర్గ సభ్యుడు నూకం రామారావు, ఎంపీటీసీ గెంటేల శ్యాం, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గం దేవేందర్, టీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శ్యాం, నాయకులు పోతన్న, నర్సాగౌడ్, సాయిబాబా, తహసీల్దార్ వెంకటరమణ, వీఆర్వో కిషన్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

భైంసా, నమస్తే తెలంగాణ : పట్టణంలోని కిసాన్‌గల్లీలో ఉన్న అయ్యప్ప క్షేత్రంలో ఇటీవల ఎమ్మెల్యే తన నిధుల నుంచి నూతనంగా కొత్త బోరు బావిని తవ్వించారు. ఈ బోరుబావి నుంచి నీరు పడడంతో నిధులతో మోటారు బిగించారు. శనివారం అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలు చేసి బోరుమోటారును ప్రారంభించారు. బోరు ఏర్పాటు కావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాలధారులు కుంట శ్రీనివాస్, కోర్వ శ్రీనివాస్, చింతల్‌బోరి గంగాధర్, టీఆర్ఎస్ నాయకులు భోజరాం తదితరులు పాల్గొన్నారు



బోరుమోటారును ప్రారంభిస్తున్న భక్తులు

పనుల్లో నాణ్యత పాటించాలి



వైకుంఠధామ పనులను పరిశీలిస్తున్న ఏపీవో

ముథోల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో నాణ్యతను పాటించాలని ఏపీవో సదానందచారి అన్నారు. మండలంలోని చించాల గ్రామంలో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో శ్మశాన వాటికలు, కిచెన్ షెడ్లను ఉపాధి హామీ నిధులు ద్వారా నిర్మిస్తున్నారని వెల్లడించారు. ఆయన వెంట సర్పంచి ఉమ, ఈసీ హరినాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులున్నారు.

స్వచ్ఛ మండలంగా మారుద్దాం

తానూర్ : తానూర్ మండలాన్ని వందశాతం స్వచ్ఛతగా మార్చేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ బాలేరావు లాలూ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఓడీఎఫ్‌పై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా ఓడీఎఫ్ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం కింద గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రత పాటించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ప్రజలు స్వచ్ఛత పాటించాలని కోరారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు త్వరతగతిన బిల్లులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీటీసీ పోతాజీరావు పటేల్, కోఆప్షన్ మెంబర్ చంద్రకాంత్ యాదవ్, ఎంపీడీవో నాగనాథ్, ఏపీవో శిరీషా, ఎంపీటీసీలు సతీశ్‌రెడ్డి, విఠల్, చంద్రశేఖర్, శంకర్, సోనబాయి, లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బాలేరావు లాలూ

శీతాకాల శిబిరం ప్రారంభం

భైంసారూరల్ : మండలంలోని హజ్గుల్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం ఖత్‌గాంలో గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం శీతాకాల శిబిరం ప్రారంభమైంది. ఏడు రోజుల పాటు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన కల్పిస్తారన్నారు. సర్పంచి రాము మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవాదృక్పథాన్ని కలిగి ఉండి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి నరేశ్‌గౌడ్, వార్డు సభ్యులు రాము, శేషరావు పటేల్, లింగన్న, నాగోరావు, లక్ష్మణ్ పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతితో అధిక దిగుబడి

ముథోల్: రైతులు అందుబాటులో ఉన్న ఆధునిక పద్ధతులను పాటించి అధిక దిగుబడిని సాధించవచ్చని ముథోల్ జడ్పీటీసీ లక్ష్మి అన్నారు. శనివారం ముథోల్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రైతులకు స్ప్రింకర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఎనిమిది మంది రైతులకు 75 శాతం సబ్సిడీపై స్ప్రింకర్లు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతుల అభ్యున్నతికి విశేషంగా కృషిచేస్తోందన్నారు. ఎంపీడీవో నూర్‌మహ్మద్, ఉద్యానవనశాఖ అధికారి వేణు, ఏఈవో మోహిన్, సాయిబాబా, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

శనగ పంట పరిశీలన

బాసర : మండలంలోని లాబ్ధి, బిద్రెల్లి, టాక్లి గ్రామాల్లో శనగ పంటను ఏఈవో అమీర్ శనగ పంటను పరిశీలించారు. శనగ పంటలకు కాండం కుళ్లు తెగుళు నివారణకు కాఫర్ ఆక్సిక్లోరైడ్ పిచికారి చేయాలని రైతులకు సూచించారు. రైతులు తమ భూములకు సంబంధించి, ఇతర సమస్యలు ఉంటే తమకు సంప్రదించాలని కోరారు.

నేడు గోసంపల్లెలో సత్యసాయినగర సంకీర్తన

ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తుల రాక

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం పుట్టపర్తి శ్రీసత్యసాయిబాబాను స్తుతిస్తూ నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి మండల కన్వీనర్ చిక్యాల రత్నాకర్‌రావ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గోసంపల్లె గ్రామంలో సాయినగర సంకీర్తన, అనంతరం సాయి ప్రవచనాలు, భజనలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. బెల్లంపల్లి, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు అవుతున్నారని రత్నాకర్‌రావ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రైతులకు బాసటగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్
- మార్కెట్‌యార్డులో కందుల కొనుగోళ్లు ప్రారంభం

ఖానాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారని ఖానాపూర్ శాసన సభ్యురాలు అజ్మీరా రేఖాశ్యాం నాయక్ అన్నారు. శనివారం ఆమె ఖానాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల కొనుగోళ్లను ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సక్కారాం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ ద్వారా కందులను కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల పాటు ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే అన్నారు. ఎకరానికి రూ. 4 వేలు ఇవ్వనున్నారన్నారు. కందులకు క్వింటాలుకు రూ.400 వరకు ధర పెంచారన్నారు. గతంలో క్వింటాలుకు రూ.5050 ధర ఉంటే ఈసారి రూ.5450 అయిందన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా వచ్చే సంవత్సరం శ్రీరాంసాగర్‌కు నీటి పంపింగ్ జరిగేలా పనులు సాగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కోటి ఎకరాలకు సాగునీరందుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సక్కారాం శ్రీనివాస్, ఎంపీపీ ఆకుల శోభారాణి, జడ్పీటీసీ తాళ్లపెల్లి సునీత, సర్పంచి నేరెళ్ల సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ డి. రాజారెడ్డి, రైతు సమన్వయ సమితి ఖానాపూర్, తిమ్మాపూర్, కడెం మండలాల కన్వీనర్లు పుప్పాల గజేందర్, కడార్ల గంగనర్సయ్య, హపావత్ రాజేందర్, మాజీ జడ్పీటీసీ రాథోడ్ రామూనాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఐల్నేని అశోక్, శంకర్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, నాయకులుసంతోష్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సయ్యద్ ఫయాం, పట్టణ అధ్యక్షుడు షేక్ షకీల్, ఇర్ఫాన్, వార్డు మెంబర్ పరిమి సురేశ్, ట్రేడర్ లక్ష్మణ్, మార్కెట్ కార్యదర్శి ఇర్ఫాన్, పీఏసీఎస్ సీఈవో భూమి ఆశన్న, మార్కెట్ సిబ్బంది రవీందర్‌రెడ్డి, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఖానాపూర్‌లో కందుల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేఖాశ్యాంనాయక్

సంక్షేమ పథకాలతోనే టీఆర్ఎస్‌లో చేరికలు


పార్టీలో చేరినవారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: అధికార టీఆర్ఎస్‌లోకి వలసలు జోరందుకున్నాయి. మందపల్లి, నాగాపూర్‌లోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, సంఘాల వుద్కులు శనివారం ఎమ్మెల్యే రేఖానాయక్ సమక్షంలో పెద్ద ఎత్తున గులాబీ పార్టీలో చేరారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు మాద భీమన్న, శంకర్, చిక్కుళ్ల రమేశ్, చాడ సంతోష్, చాబంతి భీమలింగు, బోను శంకర్, హన్మంతు, సాయిలు, నాగరాజు, యువకులకు కండువా కప్పి టీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గులాబీ గూటికి చేరుతున్నారన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, రైతులకు వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్‌ను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మందపల్లిలోని పల్కేరు వాగుపైన మినీ బ్యారేజ్ ఏర్పాటు చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం పెంబి ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వం అందజేస్తున్న దోమ తెరలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆకుల శోభారాణి, జడ్పీటీసీ తాళ్లపల్లి సనీత, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, ప్రధాన కార్యదర్శి భూమాగౌడ్, సర్పంచ్ కున్సోత్ రమేశ్, ఎంపీటీసీలు ఆరె రాజేందర్, ఆశ్వక్, తహసీల్దార్ నూనే ప్రభాకర్, వీఆర్వో రాజేందర్, నాయకులు టేకం భీంరావ్, ఎల్లయ్య, సూదుల శంకర్, చేర్పురి సుధాకర్, ఐదు విజేందర్, సొన్న రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పెంబి: రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీఆర్ఎస్ నాయకులు పనిచేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని మందపల్లి గ్రామంలో శనివారం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పర్యటించారు. కార్యకర్తలు,ప్రజలను పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరుతున్నాయో లేదో ఆరా తీశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మందపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన బాధిత కుటుంబాలను మాజీ ఎంపీ పరామర్శించారు.వారి కుటుంబాలను ఓదార్చి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ సల్లా రామేశ్వర్‌రెడ్డి, నాయకులు ఆకుల శ్రీనివాస్, సల్లా నరేందర్‌రెడ్డి, జగన్‌రావ్, పి.లక్ష్మీనారాయణ, సుధాకర్ గౌడ్, వెంకగౌడ్, లాలు, సుంచు భూమన్న, నర్సారెడ్డి, సుమన్ తదితరులు ఉన్నారు

కడెంలో..

కడెం : పెద్దూర్ తాండ గ్రామానికి చెందిన టీఆర్ఎస్ నాయకులు ఇస్లావత్ శేఖర్, సుధాకర్ తండ్రి ఇస్లావత్ భీక్యా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శనివారం వారి కుటుంబాన్ని పార్లమెంట్ మాజీ సభ్యుడు రాథోడ్ రమేశ్ పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మరో టీఆర్ఎస్ నాయకుడు ఇస్లావత్ మోహన్‌నాయక్ కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, ఆయనను పరామర్శించారు. మోహన్‌నాయక్‌కు అవసరమైన శస్త్రచికిత్సను చేయిస్తానని భరోసానిచ్చారు. ఆయనవెంట నాయకులు కోల శ్రీనివాస్, పురపాటి శ్రీనివాస్‌రెడ్డి, గొస్కుల మల్లేశ్, గడప దేవరాజు, గబాల్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.


మందపల్లిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

అర్చకుల అభ్యున్నతికి సర్కారు కృషి

బాసర : ప్రభుత్వం రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకుల అభ్యున్నతికి కృషి చేస్తోందని రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ అన్నారు. శనివారం బాసర ఆలయంలో నిర్మల్ జిల్లా అర్చక కమిటీ నియమాకం అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ధూప, దీప నైవేద్యం కింద అర్చకులకు రూ. 6వేల వేతనం అందిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు 2015 పీఆర్సీ జీవో నంబర్ 577 ప్రకారం 5625 మంది అర్చకులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున 2014 వరకు ఎవరైతే నియమితులయ్యారో వారికి మాత్రమే 2015 పీఆర్సీ వర్తిస్తుందన్నారు. 2014 తర్వాత నియామకమైన అర్చక ఉద్యోగులకు ధార్మిక పరిషత్తు ద్వారా వేతనాలు అందిస్తారని తెలిపారు. ఆదిలాబాద్‌లో వంద, నిర్మల్‌లో వంద దేవాలయాలు ధూప దీప నైవేద్యం కింద రాబోతున్నాయని చెప్పారు. కొంత మంది వ్యక్తులు అర్చక, ఉద్యోగ జేఏసీ పేరిట సంఘాలు ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని, అర్చక ఉద్యోగులను పక్క దోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న తరుణంలో ఇలాంటివి చేయడం సబబు కాదని హితవు పలికారు. అర్చకులు ప్రవీణ్ మహరాజ్, అచ్యుత్ మహరాజ్, మదన్ దీక్షిత్ ఉన్నారు.

అర్చక సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శనివారం నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల అర్చక సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీ మదన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గణేశ్ సావర్కర్, ప్రధాన కార్యదర్శిగా మురళీక్రోతి ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్ర నియామక పత్రాన్ని అందజేసి సన్మానించారు.

Endowment policy

- It runs only for a limited period or up to a particular is the policy money becomes due at the end of the period ossified in the policy any case however the accused dies before the specified time the policy money is paid at the time of death the Premium have to be paid till the date of maturity the timer time when the policy becomes payable this type of life policy convince the advantages of investment for old age with that of protection for the accused family in the event of his premature death under pure endowment policy the policy money becomes payable only if I should services the endowment terms if he died before the endowment I'm nothing is payable.

For Feedback...
vijetha.nt@gmail.com
విజేత

What are the merits of road transport?



K. NARESH GOUD
COMMERCE
Sr. FACULTY
HYDERABAD
9542564256



INTER SPECIAL
Sr. COMMERCE

Powers and functions of IRDA

1. Protection of interest of policyholders in matters concerning assigning a policy nomination by policyholders insurable interest settlement of Insurance claim surrender value of policy and other terms and conditions of contract of insurance.
2. Specifying the request qualifications and practical training for insurance intermediate or agents.
3. Specifying the code of conduct for surveyors and loss assessors.
4. Promoting efficient in the conduct of insurance business.
5. Promoting and regulating professional organisations connected with the insurance free insurance business leveling fee and other charges for carrying out the purposes of IRDA Act.
6. Calling for information from undertaking inspection of conducting enquiries and litigations including audit of Insurers, insurance intermediates and other organisations connected with the insurance business.
7. Regulating investment of funds by insurance companies regulating maintenance of margin of solvency.
8. Adjudication of disputes between insurers and intermediaries or insurance intermediaries.
9. Supervising The functioning of the trash advisory committee.
10. Exercising search other powers as may be prescribed.

- **From the following recipes and payments accounts prepare income and expenditure account of a sports club Naziabad.**

RECEIPTS AND PAYMENTS A/C

RECEIPTS	AMT	PAYMENTS	AMT
To	15000	By Land	10000
Subscriptions	50000	By Building	40000
To Donations	10000	By Furniture	10000
To Legacies	5000	By Sports	5000
To Entrance	3000	material	6000
Fee	17000	By Sports	
To Life	5000	expenditure	4000
membership fee	500	By General	28000
To Sports		expenses and	
income		maintenance	
To Sundries		By Balance c/d	
To Sale of old			
newspapers	105000		105000

Additional information:

1. Capitalize 50% of the donations, legacies, entrance fee and life membership fee.
2. Subscriptions still outstanding amount to 5000.
3. Depreciate sports material by 10%.

Income and expenditure a/c

Expenditure	AMT	income	AMT
To General expenses	1000	By Subscriptions	20000
	6000	(15000+5000)	25000
To Sports expenditure	4000	By Donations 50%	5000
			1500
To Ground expenses and maintenance	500	To Legacies 50%	
			2500
To Sports material depreciation	63500	To Life membership fee50%	17000
5000X10/100		To Entrance fee 50%	5000
To Surplus		By Sports income	500
		By Sundries	
	76500	By Sale of old newspapers	76500

- **What are the merits and demerits of road transport?**
  This is the ancient form of transport event today it remains the commonest form of transport

Merits

1. **Cheapness**
   - All forms of animal driven and man and motor driven transport are cheaper compared to the other forms on account of less maintenance expenses of the way the lying and maintenance expenses roads are the responsibility of the state.
2. **Safety**
   - Damage due to the handling of goods to lessen this form of transport.
3. **Flexibility**
   - Disadvantages could be climate only by road transport it may go near to near place of loading and delivery the goods at the place of use that to do services is one of the most attractive feature of road transport.

Demerits

1. **Irregular operation**
   - Most of the transporting System Operating on road or not coordinated therefore they play according to their convenience.
2. **Limited carrying capacity**
   - Limited load carrying capacity is one of the drawbacks of road transport there is a limit beyond which they cannot carry.
3. **Slow speed**
   - Speech is an Essential elements in marketing of goods and services especially in the present day comparative market the rule of first come first succeed applies.
4. **Rates**
   - The rate structure is obtained oscillating in character hence it creates problems for companies that consider permanency of physical distribution cost a Prestige.

Mixed policy

- It is also known as time and voyage policy is Dev sheets to ensure the object matter on a particular voyage for a specific period of time is it may be insured for you voyage between Chennai to Tokyo for a period of 6 months under a mixed policy.

- **From the following recipes and payments accounts prepare income and expenditure account of a Sri kala nilayam medak as on 31/03/2015**

RECEIPTS AND PAYMENTS A/C

RECEIPTS	AMT	PAYMENTS	AMT
To	4000	By Salaries	3000
Subscriptions		By	
To	2080	Entertainment	1600
Entertainment	120	expenses	600
receipts		By General	2000
To Sale of old		expenses	1400
furniture		By Investments	600
(Book value :	3000	By Printing	600
200)		By Furniture	
To Donations		By Balance c/d	
	9800		9800

Additional information:

1. Outstanding salaries 500.
2. Subscriptions still outstanding amount to 500.
3. Depreciate Furniture by 10%.

Income and expenditure a/c

Expenditure	amt	income	amt
To Salaries (3000+500)	3500	By Subscriptions (4000+1000)	5000
To Entertainment expenses	1600		2080
		By Entertainment receipts	160
To General expenses	600	By Deficit	
To printing	1400		
To DEP on furniture (600X10/100)	60		
To loss of old furniture sold(200-120)	80		
	7240		7240

ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం..

- ప్రమాదాలను నివారిద్దాం..
- జిల్లా కేంద్రంలో విద్యార్థుల ర్యాలీ
- కూడళ్ల వద్ద వాహన దారులకు అవగాహన

నిర్మల్‌లో విద్యార్థుల ర్యాలీ





నిబంధనలు పాటించని వాహనదారులకు ఫ్లవర్స్ అందిస్తున్న విద్యార్థులు



నిర్మల్ కల్చరల్ : జిల్లా కేంద్రంలో వాసవి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్లకార్డులు పట్టుకొని వాహనదారులకు వెళ్లి పువ్వులు అందించి ప్రమాదాలు జరుగుతున్న తీరును వివరించారు. ప్రమాదాలను నివారించే మార్గాలను తెలియజేశారు. ట్రాఫిక్ ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాల నుంచి మంచిర్యాల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించకుండా, రోడ్డు నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారికి విద్యార్థులు అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించని వారికి కరపత్రాలను ఇస్తూ రోడ్డు ప్రమాదంతో ఏర్పడే ఇబ్బందులను వివరించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని ట్రాఫిక్ ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ జగదీశ్వర్ రెడ్డి,కరస్పాండెంట్ పోతారెడ్డి,ప్రిన్సిపాల్ రాందాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

ముగిసిన 'మొగిలి జాతర'



కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

తానూర్ : మండలంలోని మొగిలి గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న జాతర శనివారంతో ముగిసింది. మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఈ జాతర నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. జాతరలో వివిధ దుకాణాలు వెలిశాయి. రంగుల రాట్నంలో చిన్నారులు సందడి చేశారు. గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. మన రాష్ట్రం నుంచే కాకుండా హర్యానా, కర్నాటక, మహారాష్ట్రల నుంచి మల్లయోధులు హాజరయ్యారు. మొదటగా చిన్నారులతో ప్రారంభమైన కుస్తీ పోటీలు పెద్దల వరకు జరిగాయి. మొదటి బహుమతి రూ.9051, రెండో బహుమతి రూ. 5051తో పాటు వెండి కడియాలను వీడీసీ అందజేసింది. కుస్తీ పోటలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. సర్పంచి మల్లుకబాయి, ఉప సర్పంచి భీంరావు, కారోబార్ భుజంగ్ సింగ్, మాజీ మండల ఉపాధ్యక్షులు లచ్చన్న, గ్రామస్తులు మోతేరాం పటేల్, షేక్ హైమద్, కోఆప్షన్ సభ్యుడు చంద్రకాంత్ పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ గోవింద్‌రావు, టీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రంగుల రట్నంలో చిన్నారుల సందడి

ఆధ్యాత్మికమే జీవన మార్గం

ముథోల్: ఆధ్యాత్మికమే జీవన మార్గమని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నరేందర్ మహరాజ్ శిష్యురాలు మధుర తాయి పేష్వే అన్నారు.శనివారం ముథోల్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మానిక్‌ప్రభు మఠం నుంచి ప్రధాన విధు ల గుండా మహిళలు కళశాలు, కోలాటాలు ఆడుతూ నరేందర్ మహరాజ్ చిత్రపటంతో శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడానికి తమవంతుగా కృషిచేయాలన్నారు. ముఖ్యంగా హిందూ ధర్మ పరిరక్షణకు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. భారతీయ సం స్కృతి ఎంతో ఉన్నతమైందని, పాశ్చాత్య సంస్కృతిని వీడనాడాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని సూచించారు. హిందూ ధర్మ పవిత్ర గ్రంథాలను విధిగా అధ్యాయనం చేయాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించా రు.కార్యక్రమంలో వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు రోళ్ల రమేశ్, ధర్మన్న, ముథోల్ సర్పంచి అనిల్ భక్తులు పాల్గొన్నారు.



కీర్తనాలు చేస్తున్న భక్తులు



ఫిలింసిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థుల విహార యాత్ర

సోన్: మండలంలోని వెల్మల్ బొప్పారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం విహార యాత్రకు వెళ్లారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రదేశాలతోపాటు రామోజీరావు ఫిలిం సిటీలోని అందాలని తిలకించారు. విహారయాత్రకు వెళ్లిన వారిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వేడి వేడి బిర్యానీ!



- ప్రభుత్వ పాఠశాలలో పౌష్టికాహారం
- ప్రతి శనివారం అమలు
- 'వారం మెనూ'లో మార్పులు చేసిన విద్యాశాఖ
- ఆనందంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

సారంగాపూర్:

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఇకనుంచి వేడివేడి బిర్యానీ అందనుంది. పౌష్టికాహారం, రుచికరమైన భోజనం అందించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి శనివారం విద్యార్థులకు ఒక వెరైటీ బిర్యానీ అందించనున్నారు. ప్రభుత్వ బడుల్లో గైర్హాజరీ శాతాన్ని తగ్గించి హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. మెనూలో మార్పులు చేస్తూ రుచికరమైన పోషకాహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టింది. మొదట వారానికి రెండు గుడ్లు మాత్రమే అందించే వారు. అనంతరం వాటి సంఖ్యను మూడుకు పెంచారు. మొదట్లో దొడ్డు బియ్యం ద్వారా ప్రభుత్వ బడులకు మధ్యాహ్న భోజనాన్ని అందించగా, గత ఏడాది నుంచి తెలంగాణ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోంది. ప్రస్తుతం ప్రతి శనివారం కూరగాయలు, బఠానీలు, మిల్‌మేకర్లు తదితర వాటితో తయారు చేసిన బిర్యానీని అందించాలని విద్యాశాఖ కమిషనర్ ఇటీవల డీఈవోలకు అదేశాలు జారీ చేశారు. కేజీబీవీల్లో కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు నెలలో రెండు సార్లు మటన్, నాలుగు సార్లు చికెన్, గుడ్లు, నెయితో భోజనం అందిస్తున్నారు. అదే తరహాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ప్రతి శనివారం బిర్యానీ భోజనం అందించనున్నారు.

జిల్లాలో 729 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 520 ప్రాథమిక, 90 ప్రాథమికోన్నత, 127 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 68వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ప్రభుత్వం అందజేయనున్న బిర్యానీ భోజనం అందనుంది.

ప్రస్తుతం మెనూ ఇలా ...

సోమవారం: గుడ్లు, సాంబార్
మంగళవారం : కూరగాయలు
బుధవారం : పప్పు, కూరగాయలు, గుడ్లు
గురువారం : సాంబార్
శుక్రవారం : కూరగాయలు, గుడ్లు
శనివారం : ఆకుకూర, పప్పు

ఇక నుంచి ...

- నెలలో మొదటి శనివారం బఠానీ పలావ్, కూరగాయలతో కుర్మ,
- రెండో శనివారం కాబాలి శనగలు, కూరగాయలతో బిర్యానీ
- మూడో శనివారం మిల్‌మేకర్ బిర్యానీ, కూరగాయలతో కుర్మా ఇవ్వనున్నారు.
- నాలుగో శనవారం మునుక్కాయ ఆకులు, పెసర పప్పుతో కిచిడి, చట్నీ వీటితో పాటు అన్నం టమాట, ఎండుబఠానీల కూర, పెసర పప్పులు, సోయాచిక్కుడు కూర అందించనున్నారు.

ప్రతి శనివారం బిర్యానీ పెట్టాలని ఆదేశాలు వచ్చాయి..



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి శనివారం బిర్యానీ పెట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. పాఠశాలల్లో తప్పకుండా ఈ మెనూ అమలయ్యేలా చూస్తాం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం.

-టామ్మె ప్రణీత, డీఈవో

పిల్లలు ఇష్టంగా తింటారు



రోజు పెట్టే భోజనానికి భిన్నంగా శనివారం బిర్యానీ పెడితే విద్యార్థులు ఇష్టంగా తింటారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

-కాలేవార్ రవీందర్, టీచర్

భైంసాకు రక్తనిధి కేంద్రం..

- ఏర్పాటుకు నిధులు
- ఆరు మాసాల్లో అందుబాటులోకి..
- ఆపదలో ఉన్న వారికి రక్తం



బ్లడ్ బ్యాంకు ఏర్పాటు కానున్న భైంసా ఏరియా దవాఖాన

భైంసా, నమస్తే తెలంగాణ : ప్రభుత్వ దవాఖానలో మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మరో ముందడుగు వేస్తోంది. ఇప్పటికే కేసీఆర్ కిట్, నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రభుత్వం.. ప్రసూతి సమయంలో అవసరమైన రక్తం అందుబాటులో ఉంచడానికి దవాఖానల్లో రక్తనిధి (బ్లడ్ బ్యాంక్) కేంద్రాల ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు జిల్లాలోని భైంసా ఏరియా వైద్యశాలలో పాటు మరో 10 కేంద్రాల్లో రక్తనిధి కేంద్రాలను మంజూరు చేసింది. ఈ రక్తనిధి కేంద్రాల ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులతో పాటు ముఖ్యంగా రక్తహీనత గల గర్భిణులకు డెలివరీ సమయంలో ఉత్తమ ప్రమాణాలు ఉన్న రక్తం వారికి అందుబాటులో ఉండనుంది.

ఏరియా దవాఖానలో భవన పరిశీలన..

రాష్ట్రంలో 26 కేంద్రాల్లో బ్లడ్ బ్యాంకులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర వైద్య విధాన పరిషత్తు 13 కేంద్రాల్లో, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో మరో 13 కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. డివిజన్ కేంద్రమైన భైంసాలోని ఏరియా దవాఖానలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పటు చేయనున్నారు. ఇందుకోసం దవాఖాన సముదాయంలోని ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దవాఖాన భవనంలోని దాదాపు వెయ్యి చదరపు అడుగుల ఏరియాలో పూర్తి స్థాయిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు కోసం వైద్య విధాన పరిషత్తు అధికారుల బృందం పరిశీలన చేసి ఆమోదం తెలిపారు. రక్త నిల్వలకు అవసరమైన పరికరాలను అమర్చడానికి అనువుగా భవన నిర్మాణం పూర్తి చేసిన తర్వాత బ్లడ్ బ్యాంకు ఏర్పాటు కానున్నట్లు వైద్యశాల వర్గాలు తెలిపాయి.

బ్లడ్ బ్యాంక్‌తో రక్త సేకరణ.. పంపిణీ..

భైంసా ఏరియా దవాఖానలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుతో రోగులకు అవసరమైన అన్ని గ్రూపుల రక్తం అందుబాటులోకి వస్తుంది. ఈ కేంద్రం ద్వారా రక్త సేకరణతో పాటు అవసరమైన రోగులకు పంపిణీ చేయడానికి అవకాశమేర్పడుతుంది.

రక్తం అందుబాటులో ఉంటుంది



భైంసా ఏరియా దవాఖానలో ప్రస్తుతం రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ మాత్రమే ఉంది. ప్రభుత్వం బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ద్వారా నియోజకవర్గంలో రక్తదాన శిబిరాల నుంచి రక్తం సేకరించే అవకాశాలు ఉంటాయి. విస్తృత స్థాయిలో రోగులకు అవసరమైన గ్రూపుల రక్తం అందుబాటులో ఉండే అవకాశాలున్నాయి.

- డాక్టర్ కాశీనాథ్, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్, భైంసా

ప్రస్తుతం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఈ స్టోర్‌లో కేవలం 10 యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ రక్తాన్ని ప్రభుత్వ దవాఖానల్లోని రోగులకు ఉచితంగా.. ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్సలు పొందుతున్న రోగులకు నిర్ణీత రుసుం వరకు అందిస్తున్నారు. అయితే ఇక్కడ కేవలం చిన్న పాటి బ్లడ్ స్టోరేజీ కేంద్రం మాత్రమే ఉండడం, అందులో 10 యూనిట్ల రక్తం మాత్రమే నిల్వ ఉంచే అవకాశం ఉండడంతో అత్యవసర సమయాల్లో రోగులకు పూర్తి స్థాయిలో రక్తం అందుబాటులో ఉండే అవకాశం లేదు. దీంతో రోగికి అవసరమైన బ్లడ్ గ్రూప్ రక్తం అందుబాటులో ఉండకపోవడంతో అనేక వ్యయ ప్రయాసలు పడి నిర్మల్, నిజామాబాద్ లేదంటే హైదరాబాద్‌కు తరలించడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో సకాలంలో రక్తం అందక రోగులు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి. భైంసాలో పూర్తి స్థాయిలో బ్లడ్ బ్యాంక్‌ల ఏర్పాటుకు నిర్ణయించడంతో ముథోల్ నియోజకవర్గ పరిసర ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర రోగులకు అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండే అవకాశాలు ఉన్నాయి. కనీసం ఆరు మాసాల్లో పూర్తి స్థాయి రక్తనిధి కేంద్రం ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ రక్త నిధి ఏర్పాటు ద్వారా ముఖ్యంగా పేద వర్గాలకు చెందిన గర్భిణులు ప్రసూతి సమయాల్లో రక్తం అవసరమైతే నిజామాబాద్, హైదరాబాద్ పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితులు తప్పనున్నాయి.



బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

49. ప్రపంచ మానవాభివృద్ధి సూచీలో చివరి స్థానంలో ఉన్న దేశం?
1) సియెర్రాలియోన్ 2) లిబియా
3) ఇథియోపియా 4) సూడాన్

50. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఎన్నో అంతర్జాతీయ సమావేశం నిర్వహించనున్నారు?
1) 40 2) 42 3) 43 4) 48

51. వరల్డ్ బుక్‌ఫెయిర్ జనవరి 6 నుంచి 14 వరకు ఏ నగరంలో జరుగుతున్నది?
1) హైదరాబాద్ 2) కోల్‌కతా 3) న్యూఢిల్లీ 4) పాట్నా

52. దేశంలో పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు జాతీయ పౌష్టికాహార మిషన్ (ఎన్‌ఎన్‌ఎం)ను ఏర్పాటుచేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించి మూడేండ్లకు రూ. 9046.17 కోట్లు కేటాయించింది. అయితే ఎన్‌ఎన్‌ఎం ఏర్పాటు నిర్ణయాన్ని కేంద్రం ఎప్పుడు తీసుకుంది?
1) 2017, డిసెంబర్ 1 2) 2017, నవంబర్ 1
3) 2017, సెప్టెంబర్ 1 4) 2017, అక్టోబర్ 1

53. 2022లో 39వ జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనున్న రాష్ట్రం?
1) పశ్చిమబెంగాల్ 2) కేరళ 3) బీహార్ 4) మేఘాలయ

54. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ ముసాయిదాను విడుదల చేసిన రాష్ట్రం?
1) అరుణాచల్‌ప్రదేశ్ 2) అసోం
3) హిమాచల్‌ప్రదేశ్ 4) బీహార్

For Feedback...
vijetha.nt@gmail.com

విజేత

రామాయణాన్ని ఉర్దూలోకి అనువదించినవారు?

కరెంట్ అఫైర్స్ & జీకే

1. రాష్ట్ర ఆర్థిక సంఘం తొలి చైర్మన్ ?
1) నిరంజన్‌రెడ్డి 2) రాజేశంగౌడ్
3) ఎం చెన్నయ్య 4) శ్రీనివాస్

2. 84వ రంజీ ట్రోఫీ విజేత విదర్భ, రన్నరప్ ఢిల్లీ. అయితే ఢిల్లీ జట్టు ఎన్నిసార్లు రంజీ ట్రోఫీ విజేతగా నిలిచింది?
1) ఆరు 2) 7 3) 8 4) 9

3. కింది వాటిలో 1934-35 మధ్య ఏ టోర్నీ ప్రారంభమైంది?
1) సంతోష్ 2) రంజీ
3) విజయ్‌హజారే 4) దులీప్

4. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 2018, జనవరి 1 నుంచి వ్యాట్ అమలులోకి వచ్చింది. మన దేశంలోని హర్యానా రాష్ట్రంలో వ్యాట్ ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
1) 2003 2) 2004 3) 2005 4) 2006

5. స్వచ్ఛ భారత్ మిషన్ బహిరంగ మల విసర్జన రహిత నగరంగా హైదరాబాద్‌ను ప్రకటించింది. గతంలో ఈ హోదా ఏయే నగరాలకు దక్కింది?
1) విశాఖపట్నం, ముంబై 2) ముంబై, చెన్నై
3) చెన్నై, కోల్‌కతా 4) ఢిల్లీ, కోల్‌కతా

6. ప్రముఖ గాయని రాధా విశ్వనాథన్ 2018, జనవరి 3న ఏ నగరంలో మృతిచెందారు?
1) బెంగళూరు 2) చెన్నై
3) హైదరాబాద్ 4) కోల్‌కతా

7. 35 ఏండ్ల తర్వాత సౌదీ అరేబియాలో ఏ సినిమా విడుదల కానున్నది?
1) రోబో 2.0 2) రోబో
3) పద్మావతీ 4) న్యూటన్



8. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ కమిషన్‌లో సభ్యులు కాని వారు?
1) బీ విద్యాసాగర్ 2) కే నీలాదేవి
3) రామ్‌పాల్‌నాయక్ 4) పైడి నర్సింహ

9. భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా విజయ్ కేశవ్ గోఖలే ఎంపికయ్యారు. గతంలో ఆయన ఏ దేశంలో భారత రాయబారిగా పనిచేశారు?
1) హాంకాంగ్ 2) చైనా
3) జర్మనీ 4) జపాన్

10. భారత్, చైనాల మధ్య 'డోక్లామ్' వివాదం ఎన్ని రోజుల పాటు కొనసాగింది?
1) 55 2) 56 3) 57 4) 58

11. కింది వాటిలో 2018, ఫిబ్రవరి 14 నుంచి 19 వరకు ఏ సదస్సు జరుగనున్నది?
1) ఐటీ కాంగ్రెస్ 2) బయో ఏషియన్
3) ఖనిజ సంపద 4) పర్యావరణం

12. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏ రోజు నుంచి సరఫరా చేస్తున్నది?
1) 2018, జనవరి 1 2) 2018, జనవరి 2
3) 2018, జనవరి 3 4) 2018, జనవరి 4



13. కింది వాటిలో భీమా కోరెగావ్ అల్లర్లతో సంబంధం ఉన్న రాష్ట్రం?
1) మహారాష్ట్ర 2) ఉత్తరప్రదేశ్
3) మధ్యప్రదేశ్ 4) రాజస్థాన్

14. భరిపా బహుజన్ మహాసంఘ్ ర్యాలీ కారణంగా కింది వాటిలో ఏ రాష్ట్రంలో అల్లర్లు జరిగాయి?
1) మహారాష్ట్ర 2) కర్ణాటక
3) ఉత్తరప్రదేశ్ 4) తమిళనాడు

15. కింది వాటిలో దేశంలో అత్యంత వేగంగా (గంటకు 160 కి.మీ.) నడిచే రైలు ఏది?
1) గతిమాన్ ఎక్స్‌ప్రెస్ 2) తేజస్ ఎక్స్‌ప్రెస్
3) శతాబ్ది ఎక్స్‌ప్రెస్ 4) బంధన్ ఎక్స్‌ప్రెస్

16. కింది వాటిలో కోల్‌కతా- ఢాకా మధ్య నడిచే రైలు ఏది?
1) శతాబ్ది ఎక్స్‌ప్రెస్ 2) బంధన్ ఎక్స్‌ప్రెస్
3) మాతృభూమి 4) కర్మభూమి

17. పీఎస్‌ఎల్వీ సీ-40 రాకెట్ ద్వారా ఎన్ని ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించనున్నారు?
1) 21 2) 31 3) 41 4) 28

18. 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో నిర్వహించనున్నారు?
1) కర్ణాటక 2) తమిళనాడు
3) తెలంగాణ 4) మణిపూర్

19. అమెరికా బయట గూగుల్ ఎక్స్‌ప్రెస్ తొలి కేంద్రం ఎక్కడ ప్రారంభించనున్నారు?
1) హైదరాబాద్ 2) విశాఖపట్నం
3) బెంగళూరు 4) మైసూరు

20. సర్కారు దవాఖానలో జన్మించే ఆడపిల్లల సంరక్షణ కోసం 'అదృష్ట లక్ష్మి' కార్యక్రమాన్ని ఏ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 1న ప్రారంభించింది?
1) తెలంగాణ 2) ఆంధ్రప్రదేశ్
3) కర్ణాటక 4) తమిళనాడు

21. బొగ్గు కుంభకోణం కేసులో తాత్కాలిక బెయిల్ పొందిన మధుకోడా ఏ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు?
1) తమిళనాడు 2) ఉత్తరప్రదేశ్
3) జార్ఖండ్ 4) ఛత్తీస్‌గఢ్

22. కింది వారిలో రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యదర్శి ?
1) సురేష్ చందా 2) అరవింద్‌కుమార్
3) ఒమర్ జలీల్ 4) దానకిశోర్

23. యునిసెఫ్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా జనవరి 1న ఎంత మంది శిశువులు జన్మించారు?
1) 3.86 లక్షలు 2) 2.86 లక్షలు
3) 2.70 లక్షలు 4) 2.45 లక్షలు

24. కింది వాటిలో ఏ సంస్థ రాయబారి అడ్రయ్ అజావులా?
1) యునిసెఫ్ 2) యునెస్కో
3) యూఎన్‌డీపీ 4) డబ్ల్యూహెచ్‌వో

25. కింది ఏ సంస్థకు 1965లో నోబెల్ బహుమతి లభించింది?
1) యునిసెఫ్ 2) యునెస్కో
3) యూఎన్‌డీపీ 4) డబ్ల్యూహెటీవో

26. ప్రపంచంలోనే అత్యంత రద్దీ గల ఎయిర్‌పోర్టు ?
1) జాన్ ఎఫ్ కెన్నడి ఎయిర్‌పోర్టు
2) ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్టు
3) రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టు
4) షార్జా ఎయిర్‌పోర్టు

27. క్రికెట్ మ్యాచ్‌ను ఒకేసారి 50 వేల మంది ప్రేక్షకులు వీక్షించే సామర్థ్యం ఉన్న స్టేడియం ఏది?
1) వడోదర 2) దుబాయ్
3) షార్జా 4) వాంఖడే

28. రాష్ట్ర ప్రభుత్వం ఏ జాతరను జాతీయ జాతరగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది?
1) నాగోబా 2) మేడారం
3) గొల్లగట్టు 4) ఏడుపాయలు

29. చంద్రుడి ఉపరితలంపైకి ఏ దేశం రోవర్‌ను పంపనున్నది?
1) అమెరికా 2) జపాన్
3) జర్మనీ 4) చైనా

30. కేంద్ర ప్రెస్ అకాడమీ చైర్మన్?
1) ఆర్కే మాథుర్ 2) చంద్రకుమార్ మురళీప్రసాద్
3) విశ్వాస్‌కుమార్ 4) అరవింద్‌కుమార్

31. కింది వాటిలో ఏ రెండు దేశాలు 70 ఏండ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోనున్నాయి?
1) దక్షిణకొరియా, ఉత్తరకొరియా
2) ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాం
3) నమీబియా, అంగోలా
4) జపాన్, దక్షిణకొరియా


32. 2018లో 23వ వింటర్ ఒలింపిక్స్‌ను ప్యాంగ్‌చాంగ్ పట్టణంలో నిర్వహించనున్నారు. ఇందులో మొత్తం క్రీడాంశాలు ఎన్ని?
1) ఆరు 2) ఏడు 3) ఎనిమిది 4) తొమ్మిది

33. కింది వాటిలో కోకాపేటలో ఏ సామాజికవర్గానికి ప్రత్యేక భవన నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు?
1) గొల్లకురుమ 2) గౌడ
3) బ్రాహ్మణ 4) పద్మశాలి

34. బేటీ బచావో బేటీ పడావో రాష్ట్ర ప్రచారకర్తగా ఎవరు నియమితులయ్యారు?
1) సమంత 2) రకుల్‌ప్రీత్‌సింగ్
3) సానియామీర్జా 4) మిథాలీరాజ్

35. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో ఏ సంస్థ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది?
1) రైల్వేజోన్ 2) సైనిక్ స్కూల్
3) ఎయిర్‌పోర్టు 4) సాంస్కృతిక పరిషత్

36. రామాయణాన్ని ఉర్దూలోకి అనువదించిన అన్వర్ జలాల్‌పూర్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
1) మధ్యప్రదేశ్ 2) తమిళనాడు
3) ఉత్తరప్రదేశ్ 4) రాజస్థాన్



వేముల సైదులు
జీకే & కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్
హైదరాబాద్



37. కింది వాటిలో సాహిత్యరంగంతో సంబంధం లేని బహుమతి?
1) వ్యాస్ సమ్మాన్ 2) కబీర్ సమ్మాన్
3) కాళిదాసు సమ్మాన్ 4) సుధాకర్ సమ్మాన్

38. కింది వారిలో 2017కు వైద్యరంగంలో నోబెల్ బహుమతి గ్రహీతలతో సంబంధం లేనివారు?
1) జఫ్రిన్ సి ఆల్
2) మైఖేల్ డబ్ల్యూ యంగ్
3) మైఖేల్ రోష్ బాస్ 4) మైఖేల్ బరోస్

39. 2018 ఏప్రిల్ 5 - మే 4 వరకు ఆస్ట్రేలియాలో 21వ కామన్‌వెల్త్ క్రీడలు జరుగనున్నాయి. ఈ టోర్నీలో మొత్తం క్రీడాంశాలు?
1) 19 2) 18 3) 20 4) 21

40. కింది వాటిలో ఏ రాష్ట్ర శాసనసభలో సభ్యుల సంఖ్య 60 కాదు?
1) అరుణాచల్‌ప్రదేశ్ 2) త్రిపుర
3) నాగాలాండ్ 4) గోవా

41. సమాచార హక్కు చట్టం రాష్ట్ర ప్రధాన కమిషనర్ డాక్టర్ రాజా సదారాం ఏ జిల్లాకు చెందినవారు?
1) మహబూబ్‌నగర్ 2) జనగామ
3) వరంగల్ 4) భువనగిరి

42. మిస్ వరల్డ్ కిరీటం ఎన్నేండ్ల తర్వాత 2017లో భారత్‌ను వరించింది?
1) 16 2) 17 3) 18 4) 19

43. మానేరు డ్యాం ప్రాజెక్టు ఏ జిల్లాలో ఉన్నది?
1) పెద్దపల్లి 2) కరీంనగర్
3) జగిత్యాల 4) సిరిసిల్ల

44. ప్రపంచంలో తొలిసారి గూడ్స్ సర్వీస్ ట్యాక్స్(జీఎస్టీ)ని అమలు చేసిన దేశం?
1) జపాన్ 2) జర్మనీ
3) ఫ్రాన్స్ 4) అమెరికా

45. ఏ దేశ అంతరిక్ష పరిశోధన సంస్థ ఏర్పడి 60 ఏండ్లు పూర్తికావస్తున్నాయి?
1) అమెరికా 2) జపాన్
3) ఫ్రాన్స్ 4) యురోపియన్ యూనియన్

46. ట్రిపుల్ తలాక్ బిల్లుకు లోక్‌సభ ఏ తేదీన ఆమోదం తెలిపింది?
1) డిసెంబర్ 28 2) డిసెంబర్ 30
3) డిసెంబర్ 29 4) డిసెంబర్ 27

47. కింది వాటిలో జర్మనీతో సంబంధం లేని సంస్థ ?
1) వోక్స్ వ్యాగన్ 2) ఫోర్డ్
3) హీరో 4) టయోటా

48. కేంద్రప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రుల సంఖ్య?
1) 76 2) 86 3) 73 4) 78

సమాధానాలు

1-2,	2-2,	3-2,	4-1,	5-1,	6-1,
7-2,	8-4,	9-4,	10-4,	11-3,	12-1,
13-1,	14-1,	15-1,	16-2,	17-2,	18-4,
19-2,	20-3,	21-3,	22-1,	23-1,	24-2,
25-3,	26-4,	27-2,	28-2,	29-4,	30-2,
31-1,	32-2,	33-1,	34-2,	35-3,	36-3,
37-4,	38-4,	39-2,	40-4,	41-3,	42-2,
43-2,	44-3,	45-1,	46-1,	47-4,	48-1,
49-1,	50-4.	51-3	52-1	53-4	54-2

'స్వచ్ఛ సర్వేక్షణ్'కు ప్రతి ఒక్కరూ సహకరించాలి

మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి

నిర్మల్ టౌన్: పేరులోనే నిర్మలత్వాన్ని సంపాదించుకున్న పట్టణాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందుకు తీసుకెళ్లాలని మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి కోరారు. శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని జామా మసీదులో ముస్లిం పెద్దలతో సమావేశాన్ని నిర్వహించి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 4400 పట్టణాలు ఎంపికయ్యాయన్నారు. అందులో నిర్మల్ ఒకటి అని గుర్తు చేశారు. పట్టణానికి వారం రోజుల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు రానున్న నేపథ్యంలో పట్టణం నిర్మలత్వాన్ని పుణికి పుచ్చుకునే విధంగా మార్చాల్సిన అవసరముందన్నారు. ఈ మేరకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెత్త వేసే ప్రాంతాల్లో ముగ్గులను వేస్తూ ప్రజలను స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగస్వాములు చేస్తున్నట్లు వివరించారు. ప్రార్థనా మందిరాల వద్ద చెత్త వేసే ప్రాంతాలను శుభ్ర పరుస్తూ ముగ్గులు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జామా మసీద్ ఆలయ కమిటీ అధ్యక్షుడు ముక్తార్ హైమద్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, డీఈ సంతోష్, కౌన్సిలర్లు మహ్మద్‌ఉస్మాన్, మేడారపు ప్రదీప్, రఫీ హైమద్‌ఖురేషితో పాటు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

కబ్రస్థాన్‌కు నిధులు ఇవ్వాలి

పట్టణంలోని సోఫినగర్ కాలనీలో కబ్రస్థాన్ కోసం నిధులు మంజూరు చేయాలని స్థానిక కౌన్సిలర్ హసీనా ఉస్మాన్ బేగంతో పాటు మైనార్టీ నాయకులు శనివారం మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. గతంలో వార్డు పర్యటనకు వచ్చిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కబ్రస్థాన్‌లో వసతుల కల్పనకు హామీనిచ్చిన నేపథ్యంలో మున్సిపల్ ద్వారా అభివృద్ధి చేయాలని వారు కోరారు.

కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు అజింబిన్‌యాహియా కౌన్సిలర్లు గోపి, లింగన్న, జహీర్, అహ్మద్‌ఖాన్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వరి నాట్లు త్వరగా పూర్తిచేసుకోవాలి: వ్యవసాయాధికారులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో పవిత్ర

లక్ష్మణచాంద: వరినాట్లు త్వరగా పూర్తిచేసుకోవాలని ఏఈవో పవిత్ర అన్నారు. శనివారం మండలంలోని పీచర గ్రామంలో రైతులకు వరిసాగుపై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్పీ కాలువద్వారా ఏప్రిల్ 9 వరకు నీటి విడుదల జరుగుతున్నందున వరినాట్లు త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. జనవరి 15 లోపు వరి నాట్లు పూర్తిచేసుకుంటే ఏప్రిల్‌లో కోతకు వస్తుందన్నారు. ఆలస్యం చేస్తే పొలాలు ఎండిపోతాయన్నారు. నారు మడుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. సమావేశంలో సర్పంచి డాబ రాజవ్వ, ఎంపీటీసీ బుర్రి రాజవ్వ, డాబ లస్మన్న, బుర్రి భూమన్న, రైతులు పాల్గొన్నారు.

వరి నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సోన్: చలికాలంలో వరి నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్మల్ మండలంలోని న్యూ పోచంపాడ్ గ్రామంలో ఏఈవోలు శనివారం రైతులకు అవగాహన కల్పించారు. చలి తీవ్రతకు నారు ఎదుగుదల బాగా ఉండడానికి రాత్రివేల నీరు పెట్టి ఉదయాన్నే ఆ నీరు తీసేసి కొత్త నీరు పెట్టాలన్నారు. రాత్రివేళ నారు మడిపైన పాలిథిన్ షీట్లు కప్పి ఉంచాలని చెప్పారు. సేంద్రియ ఎరువులు వేసుకోవడంతో మడిలో ఉష్ణం పెరిగి నారు బాగా పెరుగుతుందన్నారు. చలి తీవ్రతకు జింక్ లోపంతో నారు ఎర్రబడితే జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి నారులో పిచికారి చేసుకోవాలని సూచించారు. నాట్లు వేసుకునే వారం రోజుల ముందు నారు మడిలో కార్బోఫ్యూరాన్ 3జీ, 4జీ గుళికలను చల్లుకుంటే వరిలో కాండం తొలుచు పురుగుని అదుపు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఏఈవోలు హర్షిత, శ్రావ్య, రైతులు పాల్గొన్నారు.

మంత్రి అల్లోల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి


ప్రమాణస్వీకారం చేస్తున్న కోటగిరి అశోక్, సభ్యులు

నిర్మల్ టౌన్: మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో వెండి, బంగారం వర్తక సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆ సంఘం అధ్యక్షుడు కోటగిరి అశోక్ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పూదరి రాజేశ్వర్, ఉపాధ్యక్షులు రాం వెంకట్‌రమణ, పడిగెల నారాయణ, కార్యదర్శి ప్రవీణ్, వెంకట్‌రమణ, సలహా సభ్యులు కత్రోజి అశోక్, మూడారపు నరేందర్, కందుల లింగయ్య, చింతపండు పోశెట్టి, జాప విశ్వనాథ్, సోన్ నరేశ్, ప్రమోద్‌కుమార్, కత్రోజి కృష్ణ తదితరులున్నారు.

ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలి

లక్ష్మణచాంద: ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని మండల అధ్యక్షురాలు గుజ్జారి కౌసల్య అన్నారు. శనివారం ఆమె మండలంలోని బాబాపూర్ గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు చెక్కులు అందించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలోని పాత బావిని ఉపాదిహామి పథకం ద్వారా పూడ్చి వేస్తామని తెలిపారు. వైకుంఠ ధామాన్ని పరిశీలించారు. ఆమె వెంట సర్పంచి శ్రీవిద్య, ఎంపీడీవో శకుంతల, క్షేత్ర సహాయకుడు భీమేశ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో వందశాతం పన్నులు చెల్లించాలి

లక్ష్మణచాంద: గ్రామంలో ఉన్న ప్రజలు వందశాతం పన్నులు చెల్లించాలని పంచాయితీ కార్యదర్శి గోవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని వడ్యాల్ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వందశాతం పన్నులు చెల్లించడం ద్వారా గ్రామానికి ఫర్మార్మెన్స్ ఫండ్ అందుతుందన్నారు. గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులను చర్చించి ఆమోదించారు. పారిశుధ్యానికి గ్రామంలో తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. గ్రామంలో వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేయాలని తీర్మానించారు.

సమావేశంలో గ్రామ సర్పంచి అమరగొండ జ్యోతి, మండల ఉపాధ్యక్షురాలు కోండ్ర లక్ష్మి, పీఏసీఎస్ డైరెక్టర్ నరేశ్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్కాపూర్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సర్వే

సోన్: నిర్మల్ మండలంలోని అక్కాపూర్‌లో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం మరుగుదొడ్లపై సర్వే నిర్వహించారు. గ్రామంలో ఎన్ని కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించుకున్నారు, నిర్మించుకోలేనివారు ఎందరున్నారనే దానిపై వలీంటర్లు గ్రామ సర్పంచ్ బోండ్ల శ్రీవాణికి నివేదికను అందించారు. అనంతరం గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధికారి దస్రునాయక్, ప్రిన్సిపాల్ కె.శంకర్, అధ్యాపకులు నరేశ్, నాగరాజ్, జాతీయ సేవా పథకం అధికారి జి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

సోన్: నిర్మల్ మండలంలోని కొండాపూర్‌లో సోన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్ఠికాహారం, టీకాలపై శనివారం ఆరోగ్య విస్తరణ అధికారి జి.రాజేశ్వర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల సునీత, నసీమా బేగం, ఆరోగ్య కార్యకర్త టి.తిరుమల, ఆశ కార్యకర్త విజయ, అంగన్‌వాడీ టీచర్లు శకుంతల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైకుంఠధామానికి భూమిపూజ

సారంగాపూర్: మండలంలోని జౌళి గ్రామంలో శనివారం వైకుంఠధామ నిర్మాణ పనులకు ఎంపీడీవో గుమ్ముల గంగాధర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 18 గ్రామపంచాయతీల్లో వైకుంఠధామ పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఒక్కొక్క వైకుంఠధామానికి జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ. 10 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అన్ని గ్రామాల్లో ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శేఖర్, ఏపీవో తుల రామకృష్ణ, టీఏ నారాయణ, ఎఫ్ఏ సురేందర్, నాయకులు సుమిత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నిర్మల్ టౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించే 36వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏబీవీపీ సంఘటన కార్యదర్శి రంజిత్‌కుమార్ అన్నారు. శనివారం నిర్మల్ ఏబీవీపీ కార్యాలయంలో నల్గొండ జిల్లాలో ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగే మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు పెద్ద సంఖ్యలో మేధావులు వస్తున్నారన్నారు. అన్ని జిల్లాల నుంచి ఏబీవీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ రాజేశ్, దశరథ్, కార్తీక్, సంజీవ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పీజీటీలో జిల్లా వాసి ఎంపిక

నిర్మల్ కల్చరల్ : కడెం మండలం దర్మాజిపేటకు చెందిన మంతెన సత్యం ఇటీవల విడుదల చేసిన పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులో సోషల్ స్టడీస్ ఫలితాల్లో 300 మార్కులకు గాను 210 మార్కులు సాధించి ఐదో స్థానం దక్కించుకున్నారు. ఇతడు పదో తరగతి వరకు నిర్మల్ పట్టణంలోని విజయా హైస్కూల్,ఇంటర్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాల, పీజీ ఉస్మానియా విశ్వవిద్యాలయం, బీఎడ్ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. తండ్రి గంగారాం కడెం దవాఖానలో ఫార్మాసిస్టుగా, తల్లి వరలక్ష్మి భోద్ సివిల్ దవాఖానలో ఉద్యోగం చేస్తున్నారు.

విద్యార్థి సంఘం జిల్లా ఇన్‌చార్జిగా శేఖర్

నిర్మల్ కల్చరల్ : బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఇన్‌చార్జిగా నిర్మల్ పట్టణానికి చెందిన ఎంబడి చంద్రశేఖర్‌ను శనివారం నియమిస్తూ జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.అరుణ్‌కుమార్ ఉత్తర్వులను విడుదల చేశారు. ప్రస్తుతం ఎంబడి చంద్రశేఖర్ జిల్లా బీసీ యువజన విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జిల్లా బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఇన్‌చార్జిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రశేఖర్‌ను బీసీ నాయకులు డాక్టర్ కృష్ణంరాజు, మార్కంటి జీవన్, సముద్రాల వెంకట్, గంగాధర్ షిండే అభినందించారు.

'కావేరి'లో నేడు తాత్విక చర్చ

నిర్మల్ టౌన్: పట్టణంలోని కావేరి ఫౌండేషన్ గ్రంథాలయంలో ఆదివారం మానవ సంబంధాలు అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మునిమడుగుల రాజారావు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఫా సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. చర్చా గోష్టిలో నిర్మల్‌కు చెందిన కవులు అప్పాల చక్రధరి, దామెర రాములు, మురళీధర్, కృష్ణంరాజు, సంపత్‌కుమార్, దేవ్‌రావు, తదితరులు పాల్గొంటారన్నారు.

శబరిమలకు అయ్యప్ప భక్తుల పయనం


ఇరుమడి కడ్తున్న గురుస్వామి

నిర్మల్ కల్చరల్ : 41రోజుల పాటు అయ్యప్ప మాల ధరించిన భక్తులు శనివారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా హరిహర క్షేత్రంలోని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి ఆలయగురు స్వామి చనిగారపు చిన్నయ్య ఇరుముడి కట్టి శబరిమల యాత్రను ప్రారంచించారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

దిలావర్‌పూర్: పీఆర్టీయూ 2018 క్యాలెండర్‌ను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గంగాధర్, ఆ సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జనార్దన్ విడుదల చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరి ప్రసాద్, ఎర్ర మోహన్, ముత్యం, గణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూర్ పద్మశాలీ సంఘం ఎన్నిక

కుంటాల : మండలంలోని కల్లూర్ గ్రామ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని స్థానిక మార్కండేయ భవనంలో ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడిగా బోగ నారాయణ తెలిపారు. అధ్యక్షుడిగా గుద్దేటి గంగాధర్, ఉపాధ్యక్షుడిగా మానేటి గంగాధర్, కార్యదర్శిగా మచ్చ మనోహర్, కోశాధికారిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. సభ్యులుగా నర్సయ్య, భూషణ్, ముత్యం, గట్టుపల్లి శ్రీనివాస్, గంగాధర్, రాములు, వన్నెల సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను మార్కండేయ మందిరంలో సన్మానించారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ముథోల్ : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలోని ఉన్నతపాఠశాలలో శనివారం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అన్నెల మల్లారెడ్డి ఆ సంఘ క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను నిరంతరంగా కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

భైంసారూరల్ : మండలంలోని హజ్గుల్ గ్రామంలో శనివారం పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సర్పంచి రాము పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ విఠల్ మాట్లాడుతూ.. పశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలో భాగంగా ఈ నివారణ టీకాలు వేస్తుందన్నారు. పశువులు ఉన్న రైతులు ఈ టీకాలను తప్పకుండా వేయించాలని సూచించారు.

15వ తేదీ లోపు వరి నాట్లను వేసుకోవాలి

ముథోల్ : వరి నాట్లను ఈ నెల15లోపు వేసుకోవాలని ముథోల్ ఏడీఏ అంజిప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని వితోలి గ్రామంలో శనివారం వరి నారు మడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారిమడిలో వరిలో జింకుదాతు లోపం ఉందన్నారు. ఈ నెల15లోపు నాట్లు పూర్తయితే వాడగాలులు, అకాల వర్షాల నుంచి తప్పించుకొని పంట చేతికి వస్తుందన్నారు. దిగుబడులు కూడా పెరుగుతాయన్నారు. రైతులు ఈ విషయాలను గమనించాలని కోరారు. పంటల సమస్యలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఏవో అజ్మీరా భాస్కర్, ఎఈవో సయ్యద్ సిరాజ్, రైతు శంకర్ ఉన్నారు.



నారు మడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పదిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



హాజరైన విద్యాశాఖాధికారులు,



మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ సుధాకర్

- ఇప్పటి నుంచి కార్యాచరణ రూపొందించాలి
- పరీక్షల నిర్వాహణ విభాగం రాష్ట్ర డైరెక్టర్ సుధాకర్

నిర్మల్‌టౌన్ : పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే కార్యచరణ రూపొందించుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ సుధాకర్ అన్నారు. హైదరాబాద్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు పునశ్చరణ తరగతులను నిర్వహించాలన్నారు. పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థుల డాటాను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల వివరాలు, పాఠశాల మౌలిక వసతులు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై సూచనలు చేశారు. వీసీలో డీఈవో ప్రణీత, జిల్లా అధికారులు కరుణ, ఎంఈవోలతో పాటు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నందకుమార్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తాం

ట్రెజరీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేశ్ ధాత్రిక

నిర్మల్, నమస్తే తెలంగాణ : రాష్ట్రంలో ఆర్థికశాఖలో పనిచేస్తున్న ట్రెజరీ ఉద్యోగులు, అధికారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని ట్రెజరీ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేశ్ ధాత్రిక అన్నారు. ప్రభుత్వం తమ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో సహకరిస్తోందన్నారు. శనివారం తెలంగాణ ట్రెజరీ అధికారులు, ఉద్యోగుల సంఘం 2018–డైరీ, క్యాలెండర్లను జిల్లా ట్రెజరీ అధికారి కరుణాకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత ట్రెజరీ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, తెలంగాణలో ఉద్యోగుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని కొనియాడారు. ఎప్పటికప్పుడు ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించే విషయంలో, న్యాయబద్ధమైన బదిలీల విషయంలో ప్రభుత్వం తమకు అండగా నిలుస్తుందన్నారు. జిల్లాల్లో ఉద్యోగుల సమస్యలుంటే రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లా ట్రెజరీ అధికారి కరుణాకర్ మాట్లాడుతూ కిందిస్థాయి ఉద్యోగుల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే స్థానికంగానే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు, ఉద్యోగుల నడుమ సహృద్భావ వాతావరణం ఉండాలని దాని ద్వారా కార్యాలయాల్లో ఎప్పటికప్పుడు పనులు సజావుగా సాగుతాయని, ప్రజలకు వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో సేవలు అందించగలుగుతామన్నారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారులు రాఘవేందర్, గంగాధర్, ట్రెజరీ ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తోట సృజన్, జిల్లా నాయకులు విద్యాసాగర్, ఫహీమ్, శ్యాంసుందర్, విజయ్, మనోహర్, శశి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేశ్ ధాత్రిక

కిడ్నీ బాధితుడికి మంత్రి అల్లోల అండ

రూ. 2.50 లక్షల ఆర్థిక సహాయం

నిర్మల్, నమస్తే తెలంగాణ : దీర్ఘకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో గ్లోబల్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న నిర్మల్‌కు చెందిన సత్యనారాయణకు రాష్ట్ర గృహ, న్యాయ, దేవాదాయశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆపన్నహస్తం అందించారు. బాధితుడికి ఆపరేషన్ అవసరం ఉందని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి, అప్పాల మహేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుమ్మరి ఆనంద్ మంత్రి అల్లోల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆయన తక్షణమే స్పందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి ఆపరేషన్ కోసం అవసరమైన రూ.2.50లక్షలను అడ్వాన్సు కింద చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. బాధిత కుటుంబాన్ని మంత్రి అల్లోలతో పాటు టీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.